క్లుప్తంగా

ఘనంగా మహాకవి శ్రీశ్రీ వర్ధంతి


ప్రజాసంఘాల కార్యాలయం వద్ద శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

చింతలపూడి: మహాకవి శ్రీశ్రీ 41వ వర్ధంతిని స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద శనివారం ఎస్‌డీ రసూల్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. శ్రీశ్రీ చిత్రపటానికి మహిళా సంఘం నేతలు ఎం వరలక్ష్మీదేవి, కె అనురాధ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో అభిమానులు పాల్గొని శ్రీశ్రీ కవితలను కొనియాడారు. కార్యక్రమంలో ఆర్‌వీఎస్ నారాయణ, ప్రముఖ కవి మల్లెల జయరాజు, మారుమూడి ధామస్, నిమ్మగడ్డ అశోక్, ఎస్ సూర్యకుమార్, పాకా సర్వేశ్వరరావు, కక్కిరాల వెంకటేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ


బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి

పోలవరం రూరల్: పోలవరం మండలం కొత్తపట్టిసీమ గ్రామంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జగ్జీవన్‌రామ్ ఆశయాలకు అనుగుణంగా యువత నడుచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్, బాబూ జగ్జీవన్‌రామ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం


దాత ప్రమీలావతి కుటుంబానికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తురాలు శనివారం రూ. 1,00,005 విరాళంగా అందజేశారు. కొయ్యలగూడెంకు చెందిన గెడా ప్రమీలావతి ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబానికి ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

గ్రంథాలయంలో రికార్డుల పరిశీలన


ద్వారకాతిరుమల గ్రంథాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న శేఖర్‌బాబు

ద్వారకాతిరుమల: స్థానిక శాఖా గ్రంథాలయాన్ని శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించిన ఆయన గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారుపాపను వివరాలు అడిగి తెలుసుకుని సంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రతి ఆదివారం గ్రంథాలయంలో నిర్వహించే 'చదువంటే మా కిష్టం' కార్యక్రమంలో ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొని, పుస్తక పఠనం ద్వారా వారు మరింత విజ్ఞానాన్ని పెంపొందించుకునేలా చూడాలని సూచించారు. అలాగే నిత్యం గ్రంథాలయాన్ని ఎక్కువ మంది పాఠకులు సందర్శించేలా చర్యలు చేపట్టడంతో పాటు, వారికి అన్ని సేవలు అందించాలన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

దెందులూరు: మండలంలోని కొవ్వలి హైస్కూల్లో 10వ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వడ్లపట్ల కస్తూరిమాత మెమోరియల్ ట్రస్టు (అమెరికా) చైర్మన్ వడ్లపట్ల సత్యనారాయణ కుమారుడు రామ్‌చంద్ శనివారం ఆర్థిక సాయం అందజేశారని హెచ్‌ఎం ఎస్‌ఎల్ఎన్‌వీజీ శర్మ తెలిపారు. ప్రతి ఏటా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా టెన్త్‌లో ఎక్కువ మార్కులు సాధించిన ఆర్తల తనూశ్రీకు రూ.8 వేలు, నక్కా హర్షగోపాల్‌కు రూ.6 వేలు, కంచన పార్వతి ప్రియాంకకు రూ.3 వేలు, వేమూరి వీరవాణికి రూ.3 వేలు రాచూరు హైస్కూల్ హెచ్‌ఎం వడ్లపట్ల విజయ్‌కుమార్ చేతులు మీదుగా అందజేశామన్నారు. కార్యక్రమంలో ఉప్పలపాటి మణి మల్లికకు రూ.5 వేలు, ముసునూరి బాలత్రిపుర సుందరికి రూ.5 వేలు, బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న రేఖారవళికి రూ.25 వేలు నగదు పురస్కారాన్ని అందించారని తెలిపారు.

ఉత్సాహంగా 'నేను బడికి పోతా'


జంగారెడ్డిగూడెం: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


టి.నరసాపురం: బొర్రంపాలెంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల ర్యాలీ


కామవరపుకోట: ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈఓ డి.సుబ్బారావు, ఉపాధ్యాయులు


లింగపాలెం: ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో శనివారం విద్యాశాఖ ఆధ్వర్యంలో నేను బడికి పోతా కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. దీనిలో భాగంగా జంగారెడ్డిగూడెం బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దార్ స్లీవజోజి, ఎంఈవోలు బి.రాముడు, రాములు మాట్లాడుతూ రాష్ట్రంలో పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయని,, పాఠశాలకు రాకుండా ఉండిపోతున్న పిల్లలను మళ్లీ బడికి రప్పించేందుకు ప్రభుత్వం నేను బడికిపోతా అనే 30 రోజుల కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ఉపాధ్యాయులు పిల్లల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడాలని సూచించారు. స్టూడెంట్ కిట్స్ వచ్చాయని పిల్లలందరూ తీసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ నరేంద్రకుమార్ మాట్లాడుతూ పట్టణంలో బడి బయటి పిల్లలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రధానోపాధ్యాయులు లోవ కుమారి మాట్లాడుతో వరుసగా బడికి రాని పిల్లలను గుర్తించి ఫోన్‌లు చేసి రప్పిస్తున్నామని అన్నారు. స్టూడెంట్ కిట్, పుస్తకాలు ఇస్తున్నామని పేర్కొన్నారు.

టి.నరసాపురం: మండలంలోని బొర్రంపాలెంలో శనివారం నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. 18 ఏళ్ల లోపు పిల్లలు అందరూ బడిలో ఉండాలనే ఉద్దేశంతో విద్యాశాఖ ఆధ్వర్యంలో నేను బడికిపోతా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు టి.రామ్మూర్తి, ఎస్.కళ్యాణి చెప్పారు. ఈ కార్యక్రమం జూలై 12వ తేదీ వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కామవరపుకోట: మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా కామవరపుకోటలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి చౌతన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జేవియర్ రమేష్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలన్నారు. ఎంఈఓ డి.సుబ్బారావు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను గుర్తించి, ఉపాధ్యాయులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సహకారంతో పిల్లలందరిని పాఠశాలలో చేర్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శింగగూడెంలో ర్యాలీ

లింగపాలెం: రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ వారి ఉత్తర్వులను అనుసరించి మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదుకు స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాలని జిల్లా సమగ్ర శిక్ష ఇన్‌ఛార్జ్ సీఎంఓ, మండల విద్యాశాఖ అధికారి జంగం రవీంద్ర తెలియజేశారు. శనివారం మండల వ్యాప్తంగా పలు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచన చేశారు. ఈ సందర్భంగా ఈయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సదుపాయాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి వారికి అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా శింగగూడెం హైస్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో మండల విద్యాశాఖ అధికారులు కంట రామారావు, జంగం రవీంద్ర, సీఆర్‌ఎంటీలు కనకరాజు, కుమార్ మంగళం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బుర్ర శ్రీధర్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పారిజాతగిరిలో విశేష పూజలు



జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగ నివేదన, తీర్థప్రసాద గోష్టి తదితర పూజలు ప్రధానార్చకులు నల్లూరి రవికుమారాచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రెడ్డి రంగప్రసాద్ కుటుంబసభ్యులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. పామర్తి వెంకటేశ్వరరావు, వేంకట పద్మావతి దంపతులు, దార వంశీ, భవాని దంపతులు, కుర్రు గంగధరరావు, కె వాసుదేవసత్యనారాయణ గుప్తా ఉభయదారులుగా వ్యవరించారు. కార్యక్రమాలను ఈవో మానికల రాంబాబు పర్యవేక్షించారు.

అధికారుల గైర్హాజరుపై అసహనం

- సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ఎంపీపీ ఆవేదన
- పోలవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి

పోలవరం రూరల్: మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు పూర్తిగా హాజరుకాకపోవడంతో సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, వాటి స్థితిగతులపై అధికారులు సమావేశంలో వివరించారు. కొన్ని ప్రధాన శాఖల అధికారులు గైర్హాజరుకావడంపై సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు అసహనం వ్యక్తంచేశారు. గ్రామాల్లో సరైన డ్రెయిన్ వ్యవస్థ లేకపోవడంతో వర్షంనీరు రోడ్డుపై నిలిచిపోతోందని, దీంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో సభ్యులు అనేక సమస్యలను చర్చించి అధికారుల దృష్టికి తీసుకువెళుతున్నా అవి ఎందుకు పరిష్కారం కావడం లేదనే విషయాలను సంబంధిత శాఖల అధికారుల నుంచి తెలుసుకోవాలని ఎంపీడీవో జి.శ్రీనుకు విజ్ఞప్తిచేశారు. వింజరం గోవిందరాజుల చెరువు నుంచి ఇటుకలకోట వరకు ఉన్న కాలువ పూడిక తొలగించాలని, అలాగే ఇటుకలకోట నుంచి ఇసుక కాలువ, కడెమ్మ కాలువ మరమ్మతులు చేపట్టాలని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ ప్రాంతంలో భారీగా వర్షాలు పడితే ఇటుకలకోట గ్రామం చుట్టూ వర్షంనీరు చేరే పరిస్థితులు ఉన్నాయన్నారు. పాత పోలవరం నుంచి యడ్లగూడెం వరకు ఏటిగట్టుకు ఇరువైపులా ఉన్న డ్రెయిన్ నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయించాలన్నారు. వరదలు సమయం వస్తున్నందున వరద సమావేశం రెవెన్యూ అధికారులు ముందుగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బుగ్గా మురళీకృష్ణ, ఎంపీటీసీలు, మిడియం సింగరాజు, ఆకుల వరలక్ష్మి, కుంజం చిట్టెమ్మ, వలవల వరలక్ష్మి, మాడే ఆనంద్, కాశీ ధనలక్ష్మి, సోమరౌతు అనిత కుమారి, యామల శ్రీదేవి, పలు శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా మలయప్ప స్వామి కల్యాణోత్సవాలు


ఉత్సవాల సందర్భంగా పసుపు కొడుతున్న మహిళా భక్తులు

కొయ్యలగూడెం: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి కల్యాణోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. టెంపుల్స్ సెంటర్లోని శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో ఉపాలయంలో కొలువైన స్వామివారిని దేవేరులను విశేష అలంకరణతో తీర్చిదిద్దారు. మూలవిరాట్ విగ్రహాలకు మహిళలు సంప్రదాయంగా కొట్టిన పసుపు పారాణిని పూసి తిరుమంజన సేవ నిర్వహించారు. అనంతరం దేవేరులతో సహా స్వామి వారిని పల్లకీలో కూర్చుండబెట్టి కేరళ వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవం ఉంజల్ సేవ, పవళింపు సేవ కార్యక్రమాలతో కల్యాణోత్సవ ముగింపు ఉంటుందని ఆలయ ప్రధాన అర్చకులు గుడిపూడి శేషాచార్యులు తెలిపారు.

సీనియర్ సిటిజన్స్‌చే ఉచిత వైద్య శిబిరం


ఉచిత వైద్యశిబిరంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కామవరపుకోట: కామవరపుకోట శ్రీ వీరభద్ర సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఏలూరు ఆశ్రమ హాస్పటల్ వారిచే శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గుండె సంబంధిత, చెవి, ముక్కు, గొంతు సంబంధిత వ్యాధులు మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పులు, కిడ్నీ జీర్ణాశయ వ్యాధులు చర్మవ్యాధులు కంటి సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ సభ్యులు పత్తి పుల్లయ్య, గంటా జనార్దన్ రావు, కేఎస్ఎస్ నరసింహారావు, నల్లూరి శివరామకృష్ణ, కొండూరు రామ్మోహన్‌రావు, బచ్చు ముత్యాలరావు, కొనకళ్ళ అంజిబాబు, కొనకళ్ల ప్రభాకర్ రావు, సింహాద్రి గుప్తా, చల్లారావు సహాయ సహకారం అందించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే


అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇప్పటివరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యను అభ్యసించి ఐదేళ్లు పూర్తిచేసుకున్న విద్యార్థులను ఎలిమెంటరీ పాఠశాలలో చేర్పించడం జరిగిందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.రాణి తెలిపారు. జగన్నాధపేట -2, కమ్మరగూడెం-2, ఇటుకలకోట, వెంకటరెడ్డిగూడెం, కొమ్ముగూడెం, తోటగొంది గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు పూర్తయిన 25 మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ప్రాథమిక విద్యా కోఆర్డినేటర్ కృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థుల తల్లి తండ్రులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో భారీ వర్షం

పోలవరం రూరల్: పోలవరం మండలంలోని పాత పట్టిసీమ, వెంకటాపురం గ్రామ సమీపాల్లో శనివారం సాయంత్రం ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ గాలుల ప్రభావానికి భారీ వృక్షాలు, చెట్టుకొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ వైర్లు, స్తంభాలు విరిగిపడ్డాయి. పోలవరం, వెంకటాపురం రోడ్డులోని ఆర్‌అండ్‌బీ రహదారిపై మూడు పెద్దపెద్ద మర్రి చెట్లు విరిగిపోయి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. అలాగే పట్టిసం గ్రామంలో ఓ చెట్టు నేలకూలింది. చెట్లు రోడ్లపై పడటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. అలాగే విద్యుత్ వైర్లు తెగిపడటంతో విద్యుత్‌కు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆర్‌అండ్‌బీ రోడ్లపై పడిన చెట్లను గ్రామస్తుల సహకారంతో అధికారులు తొలగించే పనులు చేపట్టారు.


పట్టిసం గ్రామంలో మోటార్‌సైకిల్‌పై విరిగిపడిన చెట్టు →


ఈదురుగాలులతో పోలవరంలో ఆర్‌అండ్‌బీ రోడ్లపై విరిగిపడిన చెట్లు


వెంకటాపురంలో విద్యుత్ వైర్లపై పడిన తాటిచెట్టు

అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.జ్యోతిబాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలో రాములమ్మ చెలకలో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌లో రాజీవ్‌నగర్‌కు చెందిన యువతి పనిచేస్తోంది. ఈనెల 12వ తేదీన రాత్రి 10.30కు విధులు ముగిసిన తరువాత ఆమె ఇంటికి వెళ్లేందుకు రోడ్డుపై ఆటో కోసం ఎదురుచూస్తుండగా, అదే సమయంలో పట్టణానికి చెందిన కారు డ్రైవర్ ఉదయ్ కార్తీక్ తన మోటార్‌సైకిల్‌పై ఇంటి వద్ద దింపుతానని చెప్పి ఆమెను మోటార్‌సైకిల్ ఎక్కించుకుని వెళ్లాడు. స్థానిక వెంకటేశ్వరస్వామి గుడి ఆర్చి వద్దకు వచ్చేసరికి మోటార్ సైకిల్ ఆపి, ఆ యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె ప్రతిఘటించి కేకలు వేయడంతో ఉదయ్ కార్తీక్ పారిపోయాడు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మతసామరస్యాన్ని కాపాడాలి

భీమడోలు: మత సామరస్యాన్ని పాటిస్తూ బక్రీదు పండుగను ముస్లింలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు అన్నారు. భీమడోలు పోలీస్ స్టేషన్‌లో శనివారం రాత్రి ఈనెల 17న బక్రీద్ సందర్భంగా ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. గో సంరక్షణ చట్టం అమలు తదితర అంశాలపై చర్చించారు. ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సై సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వం గోవధను పూర్తిగా నిషేధించిందని, పోలీసులకు సహకరించాలని కోరారు. గో సంరక్షణ చట్టం 2017ను అతిక్రమిస్తే కఠిన శిక్ష తప్పదన్నారు. గ్రామాల్లో ముస్లింలు మనస్పర్థలుంటే పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలని సూచించారు. మత సామరస్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. ఇతర మతాల వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా బక్రీద్‌ను నిర్వహించుకోవాలన్నారు. సీఐ బీబీ రవికుమార్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో భీమడోలు, ద్వారకాతిరుమల మండలాల్లో ముస్లింలంతా భక్తి భావంతో పండుగను నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ

దెందులూరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని సీతంపేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జి.సునీత అన్నారు. శుక్రవారం పాఠశాలలో ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, తోట ఎడ్వర్డ్, తల్లిదండ్రులు, విద్యార్థులు, యాడాప్ హెల్దీ లైఫ్ స్టైలీ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ మానవ మనుగడపై ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, ఎడ్వర్డ్ సుదీర్ఘంగా అవగాహన కల్పించారు.

మెగా లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి


సి.మధుబాబు, జూనియర్ సివిల్ జడ్జి

చింతలపూడి: ఈ నెల 29న స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో నిర్వహించనున్న మెగా లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు కోరారు. శనివారం స్థానిక కోర్టు వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్‌అదాలత్‌లను వినియోగించుకోవాలన్నారు. మెగా లోక్‌అదాలత్‌లో క్రిమినల్, సివిల్ కేసులు, బ్యాంక్ రికవరీ, చెక్ బౌన్స్, బీఎస్ఎన్ఎల్ రికవరీ కేసులు, కుటుంబ తగాదా, మనోవర్తి, ప్రామిసరీ నోట్ కేసులు పరిష్కారం చేసుకోవచ్చునని తెలిపారు. కోర్టుల్లో కేసుల సంఖ్య తగ్గించడానికి పోలీసులు, న్యాయవాదులు లోక్ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కేసులు రాజీ చేసుకునే వారి కోసం ప్రతిరోజూ కోర్టులో ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేసులు రాజీ చేసుకోవడం ద్వారా విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందని చెప్పారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమాచారం కోసం దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లను, కోర్టు సిబ్బందిని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. మెగా లోక్‌అదాలత్‌పై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి పత్రికలు, ప్రసార మాధ్యమాలు విస్తృత ప్రచారం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కోర్టు సూపరింటెండెంట్ బి సత్యన్నారాయణ, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ ఆలి పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

కొయ్యలగూడెం: కిడ్నీల సమస్యతో బాధపడుతున్న వ్యక్తికి మానవత సంస్థ సభ్యులు శనివారం ఆర్థిక సహాయం అందజేశారు. కన్నాపురం గ్రామానికి చెందిన గెడ్డం వీరబాబు అనే వ్యక్తికి రెండు కిడ్నీలు పాడవడంతో అతనికి మందుల ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు అందజేసినట్లు వీఎస్ఎన్ స్వామి పేర్కొన్నారు. అతని మెరుగైన వైద్యానికి దాతలు ముందుకు వచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాల్సిందిగా మానవత సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు, జువ్వ గంగరాజు, ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, గెడ సుబ్బారావు, మానవత అధ్యక్షుడు బొమ్మ మోహన్‌రావు, చంటి తదితరులు పాల్గొన్నారు.